## క్లుప్తంగా

### పొంగులేటికి ఘన స్వాగతం



వర్ధన్నపేట : హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పురోగతిపై అధికారులతో సమీక్షా కార్యక్రమానికి హాజరయ్యేందుకు వస్తున్న రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే నాగరాజు గురువారం ఘనస్వాగతం పలికారు. శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మైస సురేశ్ కుమార్, నాయకులు వీరన్న, చీటూరి రాజు, దుబ్బాక శివ, కొండేటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీఓగా శేషాంజన్‌స్వామి



శేషాంజన్‌స్వామిని సన్మానిస్తున్న కార్యదర్శులు

పర్వతగిరి : మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ)గా శేషాంజన్‌స్వామి గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శేషాంజన్ స్వామిని మండల పంచాయతీ కార్యదర్శులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

### యోగాతో ఆరోగ్యం



పర్వతగిరి : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని హోమియో వైద్యాధికారి జోత్స్నా రాణి తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కమ్యూనిటీ హాల్‌లో గురువారం యోగా కార్యక్రమం నిర్వహించగా ఆమె పాల్గొని మాట్లాడారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ రోజూ యోగా చేయాలని కోరారు. తద్వారా బీపీ, షుగర్, మానసిక ఒత్తిడి అదుపులో ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎన్‌ఓ ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### పూర్వవిద్యార్థుల సమ్మేళనం



ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 1993–94 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంలో మునిగి తేలారు. నాడు తమకు విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమయ్య, ప్రభాకర్‌రావు, సూర్యనారాయణ, బెంజిమెన్, సమ్మయ్య, వెంకట్రావు, నర్సయ్య, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



ఖానాపురం : మండలంలోని బుధరావుపేటకు చెందిన సతీశ్, రమేశ్‌లకు మంజూరైన రూ.68 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను వారికి కాంగ్రెస్ నాయకుడు బిక్కి మురళి గురువారం పంపిణీ చేసి మాట్లాడారు. పేదలు అనారోగ్యం బారిన పడి కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటే ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సాయం అందించి ఆదుకుంటోందని తెలిపారు. గ్రామంలో రూ.68 వేల విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎల్లగౌడ్, నాయకులు మహేశ్, చాంద్‌పాషా, లింగయ్య, దామోదర్, యాకయ్య, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మార్పీఎస్ ర్యాలీని జయప్రదం చేయాలి

ఆత్మకూరు : రేపు వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి కాళోజీ కళాక్షేత్రం వరకు నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ ర్యాలీని జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల మురళీ పిలుపునిచ్చారు. మండలంలోని కటాక్షపూర్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 31వ తేదీన వరంగల్‌కు వస్తున్న మంద కృష్ణ స్వాగతం పలకాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు రఘు, నాయకులు భిక్షపతి, మంద రవి, కలకోట రాజేశ్, రాజు మొగిలి పాల్గొన్నారు.

# మహిళా సంఘాలకు కొత్త సారథులు

- కొనసాగుతున్న గ్రామైఖ్య సంఘాల ఎన్నికలు
- జూన్ 6న మండల సమాఖ్యకు..



సమావేశంలో అవగాహన కల్పిస్తున్న ఏపీఎం శ్రీనివాస్ (ఫైల్)

నెక్కొండ : మహిళా స్వయం సహాయక సంఘాల కొత్త సారథుల నియామకానికి ఎన్నికలు జరుగుతున్నాయి. గ్రామాల్లో జనరల్ బాడీలు నిర్వహించి సంఘ సభ్యుల నుంచి పాలకవర్గం, కార్యనిర్వాహక వర్గాలను ఎన్నుకుంటున్నారు. ఎన్నికల నిర్వహణపై ఇప్పటికే శిక్షణ పొందిన ఐకేపీ అధికారులు సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. నూతన సారథుల ఎన్నికలతో సభ్యులందరిలో న్యాయకత్వ లక్షణాలు పెంపొందే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. లావాదేవీల్లో కీలకంగా మారనున్న ఈ కొత్త సారథుల ఎన్నిక ప్రక్రియ జూన్ మొదటి వారంలోగా పూర్తి చేసే దిశగా అధికారులు కార్యాచరణ చేపట్టారు. మండలంలో 43 వీఓలు, 1289 స్వయం సహాయక సంఘాలు, 13 వేల 226 మంది వరకు సభ్యులు ఉన్నారు.

**కొత్త వారికి అవకాశం**

స్వయం సహాయక సంఘాల్లో కొత్త వారికి అవకాశాలు కల్పిస్తూ సెర్ప్ అధికారులు సారథులను ఎన్నుకుంటున్నారు. సంఘాల్లో 10–15 మంది సభ్యులుండడం తెలిసిందే. గ్రామాల్లో సంఘాల సభ్యులతో ఇప్పటికే సమావేశాలు నిర్వహించి నాయకులను ఎన్నుకుంటున్నారు. ఆసక్తి కలిగిన మహిళలకు అవగాహన కల్పించి నియామకాలు చేపడుతున్నారు. ఏకగ్రీవం లేదా చేతులు పైకెత్తి ఎన్నుకోవడం, చీటీలు రాసి సభ్యురాలికి మద్దతివ్వడం వంటి పద్ధతులను అనుసరిస్తున్నారు. సంఘాల ద్వారా ఎన్నికైన సారథులతో గ్రామైఖ్య పదాధిపతుల ద్వారా మండల సమాఖ్య పదాధిపతులను ఎన్నుకోనున్నారు. గ్రామాల్లో వీఓల వారీగా ఎన్నికలు నిర్వహించగా జూన్ 6న మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు సెర్ప్ అధికారులు తెలిపారు. అనంతరం మండల సమాఖ్య, తద్వారా జిల్లా సమాఖ్యకు ఎన్నిక ఉంటుంది.

**పదాధిపతుల పాత్ర కీలకం**

స్వయం సహాయక సంఘాల లావాదేవీల విషయంలో సంఘాల పదాధిపతుల పాత్ర కీలకం. సంఘాలకు ప్రభుత్వ రుణాలు మంజూరు చేయించడం క్రియాశీలకం. స్త్రీనిధి రుణాలు ఇస్తుండడంతో మహిళలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు. మహిళలు ఓవైపు కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తునే మరోవైపు రుణసాయం పొందతూ చిరు వ్యాపారాల్లో రాణిస్తూ ఆర్థికంగా బలోపేతం అవుతున్నట్లు కనపడుతోంది. ప్రతినెలా పొదుపు డబ్బుతోపాటు స్త్రీనిధి, రాయితీ రుణ డబ్బు కూడా బ్యాంకుల్లో జమ చేస్తున్నారు. మండలంలో మహిళా సంఘాల సభ్యులు కోట్ల రూపాయల లావాదేవీలతో బ్యాంకర్లను సైతం అబ్బుర పరుస్తున్నారు.

**నూతన బైలా ప్రకారం మార్పు**

సెర్ప్ నూతన బైలా ప్రకారం స్వయం సహాయక సంఘాలకు నూతన సారథులను ఎన్నుకునే ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే వీఓల వారీగా జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించి నూతన పదాధిపతులను ఎన్నుకుంటున్నాం. పలు గ్రామాల్లో సమావేశాలు పూర్తవుతాయి. జూన్ 6న మండల సమాఖ్య సమావేశం నిర్వహించి కొత్త సారథులను ఎన్నుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

– శ్రీనివాస్, ఏపీఎం, నెక్కొండ

# కొలువుదీరిన పీఏసీఎస్ పాలకవర్గాలు



నర్సంపేట : బాధ్యతలు చేపట్టిన చెన్నారావుపేట పాలకవర్గం



నెక్కొండ : బాధ్యతలు చేపడుతున్న చైర్మన్ మారం రాము, డైరెక్టర్లు



ఖానాపురం : మాట్లాడుతున్న రామస్వామి



దుగ్గొండి : మాట్లాడుతున్న చైర్మన్ రాజేశ్వర్‌రావు

- హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో..

నర్సంపేట/నెక్కొండ/ఖానాపురం/దుగ్గొండి : హైకోర్టు ఆదేశాలతో నియోజకవర్గంలోని పలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గాలు గురువారం కొలువుదీరాయి. ఫిబ్రవరి 14న పూర్తి కానున్న పాలక వర్గాలను ప్రభుత్వం ఆర్నెల్లుగా పొడిగించగా అవకతవకల ఆరోపణలు ఎదుర్కొంటున్న సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించిన విషయం తెలిసిందే. అవకతవలపై పారదర్శక దర్యాప్తు చేపట్టే పేరుతో పాలకవర్గాల పొడగింపును నిలిపేసినట్టు ప్రచారంలో ఉంది. ఈ క్రమంలో ఆయా పాలకవర్గాలు హైకోర్టును ఆశ్రయించగా యథావిధిగా బాధ్యతలు కొనసాగించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి దిశా నిర్దేశం చేసింది. అయినా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించకపోవడంతో పాలకవర్గాలు మళ్లీ కోర్టును ఆశ్రయించాయి. ఈ క్రమంలోనే తాజాగా కోర్టు ఆదేశాల మేరకు జిల్లా సహకార అధికారి నీరజ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో చెన్నారావుపేట, నెక్కొండ, ఖానాపురం, దుగ్గొండి మండలంలోని నాచినపల్లి సహకార సంఘాల పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టాయి. కాగా చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన క్రమంలో వైస్ చైర్మన్ చింతకింది వంశీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఖానాపురం సొసైటీ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో చైర్మన్ రామస్వామి, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు మాట్లాడుతూ కోర్టు తీర్పుతో న్యాయం జరిగిందన్నారు. పాలకవర్గాలను రద్దు చేసేందుకు డీసీఓ, ఇతర అధికారులు కాంగ్రెస్‌తో కుమ్మక్కయ్యారని ఆరోపించారు.

# విద్యారంగానికి ప్రభుత్వ ప్రాధాన్యం



వర్ధన్నపేట : సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

- కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సత్యం, సురేశ్

వర్ధన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం, పట్టణ అధ్యక్షుడు మైస సురేశ్, స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గానికి రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైన సందర్భంగా ఆ పార్టీ మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో పట్టణంలో సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీకి గురువారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సత్యం, సురేశ్, వెంకటయ్య మాట్లాడారు. ఎమ్మెల్యే నాగరాజు చొరవతో నియోజకవర్గానికి స్కూలు మంజూరైందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పోశాల వెంకన్న, అఫ్సర్, అల్లంనేని కమలాకర్‌రావు, సమ్మెట సుధీర్, తుమ్మల రవీందర్, భూక్యా శ్రీలత, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కక్రమాలతిరెడ్డి, నాను, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : వర్ధన్నపేట నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరైన నేపథ్యంలో స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు పార్టీ ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే నాగరాజు చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ మాట్లాడారు. ప్రభుత్వం రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కుసుం రాంచందర్, సొసైటీ డైరెక్టర్ గంగాధర్‌రావు, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.



పర్వతగిరిలో..



రాయపర్తి : బస్టాండ్ ఆవరణలో..

రాయపర్తి : పాలకుర్తి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరైన క్రమంలో స్థానిక బస్టాండ్ ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ రెడ్డి చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి

- ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు వీరారెడ్డి



విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యమకారులు

నర్సంపేట : తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు, మండల ఇన్‌చార్జ్ మల్లాడి వీరారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో చెన్నారావుపేటలోని స్వామి వివేకానంద విగ్రహానికి ఉద్యమకారులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడారు. రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన వారికి పెన్షన్, ఇతర సదుపాయాలు కల్పిస్తామంటూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఇకనైనా ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు జారీ చేయడంతోపాటు రూ.25 వేల గౌరవ వేతనం అందించాలని, రాజీవ్ యువ వికాస పథకంలో 20 శాతం కేటాయించాలని, ఇందిరమ్మ ఇళ్లు అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫోరం మండల అధ్యక్షుడు ఉప్పునూతల లింగమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొడగాని రాజవీరు, మండల ప్రధాన కార్యదర్శి మేడిద లక్ష్మణ్, మండల సహాయ కార్యదర్శి శీలం రాజు, నూకల ముత్తయ్య, పరకాల కొమురయ్య, పాలకుర్తి వెంకన్న, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

- మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్

పరకాల : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య పనుల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో పేరుకపోయిన చెత్తాచెదారాన్ని పరిశీలించారు. తక్షణమే మురికి కాల్వలో నిలిచిన నీటిని తరలించడంతో పాటు చెత్తను తొలగించాలని జవాన్‌ను ఆదేశించారు. వర్షాకాలంలో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పనులు చేపట్టాలని, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రజలు పారిశుద్ధ్య పనులపై ఫిర్యాదు చేస్తే తక్షణమే పరిష్కారం కోసం చర్యలు చేపడుతామని అన్నారు.

**యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలి**

జూన్ 21వ తేదీన యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పరకాల మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ పిలుపునిచ్చారు. గురువారం తన కార్యాలయంలో యోగా ఇన్‌స్ట్రక్టర్ భోగ రఘుపతితో కలిసి మున్సిపల్ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యోగా ఇన్‌స్ట్రక్టర్ అమూల్య, మున్సిపల్ అధికారులు రవి, వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్స్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాల ఎంపిక కీలకం



నర్సంపేట : మాట్లాడుతున్న ప్రొఫెసర్ విద్యాధర్



గీసుకొండ : మాట్లాడుతున్న శాస్త్రవేత్త సౌమ్య



దుగ్గొండి : మాట్లాడుతున్న నాగభూషణం

- వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ విద్యాధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ అనూష

నర్సంపేట : సరైన దిగుబడి సాధించడంలో నాణ్యమైన విత్తనాల ఎంపిక కీలకమని ఆచార్య జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయ అనుబంధ వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ విద్యాధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ అనూష తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమానికి వారు అతిథులుగా హాజరై మాట్లాడారు. రైతులు నాట్లకు ముందు విత్తనాల నాణ్యతను తప్పనిసరిగా పరిశీలించాలని చెప్పారు. యూరియా వాడకాన్ని తగ్గించాలని, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలని సూచించారు. ఏటా పంట మార్పిడి చేసుకుంటే భూసారం పెరుగుతుందని తెలిపారు. పంటల సాగులో వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయక సంచాలకుడు (ఏడీఏ) దామోదర్‌రెడ్డి, ఏఓ గోపాల్ రెడ్డి, ఎంపీఓ శ్రీధర్ రాజు, ఏఈఓ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

**కృత్రిమ మేధ సాయం తీసుకోండి**

గీసుకొండ : వ్యవసాయంలో రైతులు నూతన సాంకేతికత, ఎరువులు, నీటి యాజమాన్యం, తదితరాలపై కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్) సాయం తీసుకోవాలని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలు సౌమ్య, రాజు, గణేశ్ సూచించారు. మండలంలోని మొగిలిచర్ల, పోతరాజుపల్లి, చంద్రయ్యపల్లి, మనుగొండ గ్రామాల్లో వానాకాలం పంటల సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పీఎం కిసాన్, సాయిల్ హెల్త్ కార్డు, రైతు భీమా, పీఎం ఎఫ్‌బీవై, ఈ–నామ్‌పై అవగాహన కల్పించారు. సాగుకు అనుబంధంగా కోళ్లు, గొర్రెలు, పశుపోషణ చేపడితే ఏడాది పొడవునా ఆదాయం లభిస్తుందని చెప్పారు. కార్యక్రమాల్లో శాస్త్రవేత్తలు కన్నబాబు, రత్నకుమార్, రమేశ్, సురేశ్, ఏఓ హరిప్రసాద్, ప్రత్యేక అధికారి శ్రీనివాస్, కార్యదర్శి శంకర్‌రావు, ఏఈఓలు సంపత్, తదితరులు పాల్గొన్నారు.

**పంటల మార్పిడితో భూసార పరిరక్షణ**

దుగ్గొండి : పంటల మార్పిడితే భూసార పరిరక్షణకు బాటలు వేయాలని వరంగల్ ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త నాగభూషణం కోరారు. స్థానిక రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించడంతోపాటు పంట మార్పిడి విధానాన్ని పాటించాలని సూచించారు. సాగునీటిని పొదుపు వాడుకోవాలని చెప్పారు. మేలైన సాగు పద్ధతులతో సుస్థిర ఆదాయాన్ని పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఓ మాధవి, ఏఈఓ హన్మంతునాయక్, తదితరులు పాల్గొన్నారు.

**రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలి**

ఖానాపురం : రైతులు రసాయనిక ఎరువులు, యూరియా వాడకాన్ని తగ్గించాలని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ దిలీప్ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమగ్ర పంటల విధానాన్ని పాటిస్తే అధిక దిగుబడులు సాధించొచ్చని చెప్పారు. భూసారాన్ని, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ మేలైన విత్తనాలను ఎంపిక చేసి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. జీవ, సేంద్రీయ, పచ్చిరొట్ట ఎరువులు, పశువుల పెంట మేలన్నారు. సమావేశంలో శాస్త్రవేత్త విశ్వతేజ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాశమూరి హరిబాబు, ఏఓ బోగ శ్రీనివాస్, ఏఈఓ ఆశాదీప్, తదితరులు పాల్గొన్నారు.

### చల్లగా చూడు.. నాగేంద్రస్వామి!




హైదరాబాద్‌లో మహేశ్‌కుమార్ గౌడ్ దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

గీసుకొండ : మండలంలోని సుప్రసిద్ధ ఊకల్ నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ అర్చకులు గురువారం హైదరాబాద్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ – సంధ్యారాణి దంపతులకు వేద ఆశీర్వచనం చేశారు. మహేశ్‌కుమార్ గౌడ్ ఇంటికి వెళ్లి స్వామి వారు చల్లగా చూడాలంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన టీపీసీసీ చీఫ్‌గా నియామకానికి ముందు నుంచి ఊకల్ నాగేంద్ర స్వామి అంటే ఎనలేని భక్తి చాటేవారు.

### కమిటీ ఎన్నిక

శాయంపేట : స్థానిక సురేఖ మండల సమాఖ్య కమిటీని గురువారం పరిశీలకులు ప్రవళిక, కవిత ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా గడిపె సుమలత, కార్యదర్శిగా అమ్మ వసంత, కోశాధికారిగా దాసరి కల్పనాదేవిని ఎన్నుకున్నారు. ఏపీఎం శ్రీధర్‌రెడ్డి, సీసీలు శుభాకాంక్షలు తెలిపారు.

### బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



కొమురయ్య కుటుంబానికి నగదు అందిస్తున్న కుమార్, తదితరులు

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన చిర్ర సాయిలు, చెత్తమ్మ, బోయిని కొమురయ్య ఇటీవల మృతి చెందగా సాయిలు, చెత్తమ్మ కుటుంబాలకు రూ.3 వేలు చొప్పున, కొమురయ్య కుటుంబానికి రూ.5 వేలు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ గురువారం సాయం అందజేశారు. తొలుత మృతుల చిత్రపటాలకు కుమార్ నివాళులర్పించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. పేద కుటుంబాలకు ఫౌండేషన్ అండగా ఉంటుందని కుమార్ భరోసా ఇచ్చారు. కార్యక్రమాల్లో ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లేతాకుల రంగారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పరుపాటి రవీందర్‌రెడ్డి, గబ్బెట కొమురయ్య, ఎల్లస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి

- 'మెపా' రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్

దుగ్గొండి : గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసి ముదిరాజ్ కులస్తులను ఆదుకోవాలని ముదిరాజ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ కోరారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన ముదిరాజ్ మహాసభ మండల స్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన ముదిరాజ్ రిజర్వేషన్ హామీని వెంటనే అమలు చేయాలని, ముదిరాజ్ కులస్తుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం ప్రభాకర్, మండల అధ్యక్షుడు సంకెల్ల స్వామి, నాయకులు తిరుపతి, జటబోయిన రాజేందర్, భూమయ్య, సదానందం, కిషోర్, శంకర్, వేణు, అశోక్, శివ, నాగరాజు, మల్లయ్య పాల్గొన్నారు.

# 'ఆపరేషన్ కగార్'ను నిలిపేయాలి

- ఏఐఎఫ్‌టీయూ (న్యూ) అధ్యక్షుడు మల్లేశం



సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్సంపేట : మావోయిస్టుల ఏరివేత పేరుతో చేపట్టిన కగార్ ఆపరేషన్‌ను నిలిపేయాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేషం, ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి ప్రతాప్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ(ఎంఎల్) కార్యాలయంలో తెలంగాణ రైతు కూలీ సంఘం, ఏఐకేఎంకేఎస్, రైతు కూలీ సంఘాల ఆధ్వర్యంలో జూన్ 1న పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో నిర్వహించనున్న సదస్సుకు సంబంధించిన పోస్టర్లను వారు గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మధ్య భారతంలో ఆదివాసీలపై హత్యాకాండ కొనసాగిస్తోందని విమర్శించారు. ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్లపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ చేయించాలని, మావోయిస్టులతో చర్చలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొబ్బ ఆనంద్, ఈర్ల పైడి, జిల్లా నాయకులు భూమా అశోక్, రాంచందర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.